



● సాగరంలోకి తాబేలు పిల్లలు 10లో

హంసలదీవి కృష్ణా సాగర సంగమంలో శనివారం అరుదైన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను వదిలారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాలకాయితిప్ప బీచ్ వద్ద అటవీ శాఖ సంరక్షణలో ఉన్న 342 తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో వేధింపులు

మచిలీపట్నం ఈఈ కార్యాలయంలో ఉద్యోగులపై ఒత్తిడి

మచిలీపట్నంలోని గ్రామీణ నీటిపారుదల శాఖ విభాగంలో పరిపాలన గాడి తప్పుతోందా.. ఉద్యోగులు, అధికారుల మధ్య విభేదాలు పొడచూపి ప్రచ్ఛన్నయుద్ధం నడుస్తోందా.. అధికారుల వేధింపులు అధికం కావడంతో ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారా.. ఈ కార్యాలయంలో పనిచేయలేనంటూ ఇటీవల ఓ మహిళా ఏఈఈ రాసిన లేఖ పై ప్రశ్నలన్నింటినీ నిజమేనని చెబుతోంది.

ఇక్కడ పనిచేయలేనంటూ ఓ మహిళా ఏఈ లేఖ

- సెలవులు మంజూరు చేయకుండా నోటీసులు జారీ
- జీతం కూడా ఇవ్వకుండా వేధింపులు
- సాయంత్రం 6 వరకు పనిచేయాలంటూ హుకుం

సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి ఈఈ ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పరిపాలనా సౌలభ్యం నిమిత్తం గతంలో గుడివాడలో ఉండే గ్రామీణ నీటిపారుదల శాఖ విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ కార్యాలయాన్ని జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి మార్చారు. గత ఏడాది అక్టోబరులో ఇక్కడ బదిలీలు జరిగాయి. కాగా, వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు పనిచేయాల్సిన ఈ విభాగంలోని ఉన్నతాధికారులు.. ఆ పని చేయకుండా అధికారులను, సిబ్బందిని ఏదో ఒక కారణం చూపి ఇబ్బందులపాలు చేయడం చర్చనీయాంశమవుతోంది. ఈఈ కార్యాలయంలో సర్దుబాటు కోటాలో వచ్చిన ఓ సీనియర్ అసిస్టెంట్ అధికారితో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కలిసి వేధింపులకు గురిచేసేందుకు వ్యూహం రచిస్తుండటంతో ఉద్యోగులు హడలిపోతున్నారు.

సాయంత్రం 6 వరకు పనిచేయాలని సర్క్యులర్

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి వచ్చి, సాయంత్రం 6 గంటల వరకు విధుల్లోనే ఉండాలని రెండు నెలల క్రితం సర్క్యులర్ జారీ చేశారు. దీంతో ఉద్యోగులు జిల్లాలో ఏ ప్రభుత్వ కార్యాలయంలో లేని నిబంధనలు ఇక్కడే అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు ఏ సమయంలో కార్యాలయానికి వచ్చి వెళ్లిపోయినా పట్టించుకోవట్లేదని, కొందరిని మాత్రం సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయంలోనే ఉండాలని షరతులు పెడుతుండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు

బదిలీపై వచ్చిన ఏఈలు, ఇతర ఉద్యోగులకు కార్యాలయంలో ఇష్టానుసారంగా సీట్లు కేటాయించారు. అదేమని అడిగితే కొంతకాలం పోయాక సర్దుబాటు చేస్తామని, ప్రస్తుతం మీకు కేటాయించిన బాధ్యతలు నిర్వర్తించాలని చెప్పారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా ఓ అధికారిని ప్రసన్నం చేసుకున్నవారికి కోరుకున్న పనులను అప్పగించి, ఇష్టంలేని వారికి చిత్తానుసారంగా సీట్లు కేటాయించారు. కల్పన అనే ఏఈకి పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించలేదు. గతంలో పనిచేసిన ఈఈ సూచించిన విధంగా సీటు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదు. అలా చేయకుండా తమ చిత్తానుసారంగా ఈఈ కార్యాలయంలో కొందరు ఏఈలకు సీట్లను కేటాయించారు.



మచిలీపట్నంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం

తప్పుడు నివేదికలు

మండలస్థాయిలో నీటిసంప్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు జియోట్యాగ్ చేసే పనికి సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. కానీ, వాస్తవ పరిస్థితులకు, ఈ నివేదికకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటోంది. వీటిని సరిచేసి పంపే బాధ్యతను ఒక మహిళా ఏఈకి అప్పగించారు. ఇలా ఉన్న నివేదికలపై ఈఎన్‌సీ కార్యాలయంలో నిలదీస్తున్నారు. ఏదో ఒకటి సరిచేసి పెట్టాలని ఈఈ స్థాయి అధికారి చెబుతుండటంతో పాటు రిపోర్టులు సక్రమంగా చెప్పకపోవడం, పంపకపోవడం ఏమిటనే అంశంపై కొందరు ఉద్యోగులకు ఎంచుకుని మరీ వేధింపులకు గురిచేస్తుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఉద్యోగులు, అధికారుల మధ్య వివాదాలు ముదిరిపోతున్నాయి. దీంతో మహిళా ఏఈ ఒకరు తాను వేధింపులకు గురవుతున్న తీరు, కార్యాలయంలో ఉన్న పరిస్థితులను వివరిస్తూ ఆరు పేజీల లేఖను రాశారు. తాను ఈఈ కార్యాలయంలో పనిచేయలేనని, దీర్ఘకాలిక సెలవు పెడతానని, మంజూరు చేయాలని కోరారు. ఈ లేఖ బయటకు పొక్కడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

నోటీసులపై నోటీసులు

ఈఈ కార్యాలయంలో పనిచేసే అసిస్టెంట్ మహిళా టెక్నికల్ ఉద్యోగి వ్యక్తిగత కారణాలతో రెండు రోజుల సెలవు తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన అధికారి ఆమె రెండు రోజుల వేతనాన్ని ట్రెజరీలో మిగతా 10లో..

ఉమ్మడి కృష్ణాకు 1,213 పోస్టులు

మెగా డీఎస్సీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.. నేడే నోటిఫికేషన్

- ప్రభుత్వ, జడ్పీ, ఎంఈపీ, మునిసిపల్ స్కూళ్లలో 1,208 పోస్టులు
- ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 5 పోస్టుల భర్తీ
- ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగుల హర్షాతిరేకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మెగా డీఎస్సీ-2025 ద్వారా మొత్తం 1,213 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో 1,208 ఉపాధ్యాయ పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల విభాగంలో 5 ఉపాధ్యాయ పోస్టులను కలిపి మొత్తం 1,213 పోస్టులకు అవకాశం కల్పించింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసేందుకు జారీ చేసిన 1,208 పోస్టుల్లో లాంగ్వేజీ-1 (తెలుగు)- 39 పోస్టులు, హిందీ- 25 పోస్టులు, ఇంగ్లీషు- 93 పోస్టులు, గణితం- 52 పోస్టులు, ఫిజికల్ సైన్స్- 54 పోస్టులు, బయాలజికల్ సైన్స్- 142 పోస్టులు, సోషల్- 135 పోస్టులు, ఫిజికల్ ఎడ్యుకేషన్- 123 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) టీచర్లు- 545 పోస్టుల ప్రాతిపదికన నోటిఫికేషన్ జారీ కానుంది. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఇంగ్లీషు- 1, ఫిజికల్ సైన్స్- 1, బయాలజికల్ సైన్స్- 1, ఎస్‌జీటీలు- 2 చొప్పున నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

ఐదేళ్ల కల నెరవేరిన వేళ


ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులుగా ఉన్న బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వం మాయమాటలు చెప్పి నిరుద్యోగుల మిగతా 10లో..

అవినీతి అధికారి.. దారి దోపిడీ

ఉమ్మడి కృష్ణాజిల్లాను దోచేస్తున్న రవాణాధికారి

రవాణా శాఖలో ఆయనొక బాస్. అంతకుమించి వసూల్ రాజా అంటే సరిగ్గా సరిపోతుంది. కలెక్షన్ల కోసం ఏజెంట్లనే నియమించుకున్న లంచాల ఘనాపాఠి ఆయన. ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా దందా చేస్తే తెలిసిపోతుందని.. కృష్ణాజిల్లాపై పడ్డాడు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు కేంద్రంగా కలెక్షన్ ఏజెంట్లను పెట్టుకుని విచ్చలవిడిగా వసూళ్లకు తెరలేపాడు. ఈ అధికారి దెబ్బతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు.. వాహనదారులపై పడి అందినకాడికి దోచేస్తున్నారు.

- మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరులో కలెక్షన్ ఏజెంట్లు
- జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లోనూ నియామకం
- సహాయ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతోనే దందా
- గన్నవరంలో ప్రైవేట్ వ్యక్తికి బాధ్యతలు.. హల్‌చల్
- ఇసుక, మెటల్ లారీల నుంచి దండిగా వసూళ్లు
- ట్రాక్టర్ ట్రక్కులను ఏమార్చి మస్తుగా మామూళ్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖలోని ఓ రాష్ట్రస్థాయి అధికారి ఉమ్మడి కృష్ణాజిల్లాలో వాహనాల నుంచి భారీగా మింగుతున్నారు. ఈ సార్ నిర్దేశిస్తున్న టార్గెట్లు చేరుకోవడానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఎంవీఐ) అసోసియేషన్లు సమావేశాలు కూడా నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

మచిలీపట్నంలో మామూళ్లు

మచిలీపట్నంలో ఒక ఎంవీఐను కలెక్షన్ ఏజెంట్‌గా పెట్టుకున్నారు. డీటీవో పరిధిలోని ఇసుక లారీలకు, పోర్టుకు వెళ్లే మెటల్, గ్రావెల్ లారీలకు నెలవారీ మామూళ్లు పెట్టేశారు. ఈ మామూళ్లకు సహకరించని వారిపై ఓవర్‌లోడ్ పేరుతో కేసులు రాస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. ఈ మామూళ్లపై మొదట్లో మెటల్ లారీ యజమానులు ఎదురుతిరిగారు. దీంతో వరుసగా లారీలను అడ్డుకుంటూ జరిమానాల మోత మోగించారు. ఈ దెబ్బతో లారీ యజమానులు మామూళ్లు ఇవ్వడానికి అంగీకరించారు. అడిగినంత ముట్టజెబుతున్నామని ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నారు. రోజురోజుకూ కలెక్షన్ పెరగడంతో సదరు సార్.. టార్గెట్లు మరింత పెంచారు. దీంతో కలెక్షన్ ఏజెంట్ ట్రాక్టర్ల ట్రక్కులపై మిగతా 10లో..

కలెక్షన్ ఏజెంట్లకు సార్ అభయం

తన కోసం కలెక్షన్ ఏజెంట్లుగా మారిన కొందరు అవినీతి ఇన్‌స్పెక్టర్లకు సార్.. అండగా ఉంటారు. వారెన్ని తప్పులు చేసినా కాచుకుంటారు. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా సరే.. వారికి సంబంధించిన ఫైల్‌ను హెడ్డాఫీసుకు పంపరు. వారిపై విచారణ నివేదికలను తొక్కి పట్టేస్తారు. దీంతో కలెక్షన్ ఏజెంట్లు విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్నారు. బాస్ అండతో కొందరు అవినీతి ఇన్‌స్పెక్టర్లు హైవేలు, టోల్‌గేట్ల దగ్గర ప్రైవేట్ సిబ్బందిని పెట్టుకుని వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ బస్సుల యాజమానుల నుంచి నెలవారీ మామూళ్లను నిర్దేశించుకోవడంతో వారి జోలికి వెళ్లరు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే లారీలనే లక్ష్యంగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు.

గొల్లపూడిలో క్లోవర్ లీఫ్

హైదరాబాద్-విజయవాడ 6 వరసల విస్తరణకు డీపీఆర్

- గొల్లపూడి వద్ద క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదన
- ఇంతకుముందు రింగ్ జంక్షన్ ఏర్పాటు చేయాలని సర్వే
- తెరపైకి క్లోవర్ లీఫ్ రావడంతో గొల్లపూడి ట్రాఫిక్‌కు రిలీఫ్

16, 65వ నెంబర్ జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట గొల్లపూడిలో 'క్లోవర్ లీఫ్' జంక్షన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రెండు ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట క్లోవర్ లీఫ్ లేకపోతే ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ సర్వే తెలియజేయడంతో అధికారులు ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించటానికి డీపీఆర్ రూపకల్పన చేస్తున్న నేపథ్యంలో.. గొల్లపూడిలో విజయవాడ వెస్ట్ బైపాస్ అనుసంధానం అయ్యేచోట క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రింగ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు ఇంతకుముందే నిర్ణయించారు. ఈ రింగ్‌ను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న దానిపై కన్సల్టెంట్‌ను కూడా నియమించారు. ఇదే సమయంలో హైదరాబాద్-విజయవాడ 6 వరసల విస్తరణకు సంబంధించి డీపీఆర్ రూపకల్పన జరుగుతుండటంతో క్లోవర్ లీఫ్ ప్రతిపాదన ముందుకొచ్చింది.

రింగ్ పోయె.. క్లోవర్ లీఫ్ వచ్చే..

విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు.. చిన్న అవుటపల్లి దగ్గర ఎన్‌హెచ్-16 నుంచి మర్లపాలెం, గన్నవరం, కొండపావులూరు, మిగతా 10లో..

ముంబయికి క్రేజ్

- ఇప్పటికే ఎయిరిండియా, ఇండిగో సర్వీసులు
- తాజాగా మరో సర్వీసుకు ఎయిరిండియా సన్నాహాలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి మరిన్ని సర్వీసులు నడపడానికి విమానయాన సంస్థలు పోటీ పడుతున్నాయి. విజయవాడ-ముంబాయికి మొదటిసారిగా ఎయిరిండియా సర్వీసును ప్రారంభించింది. కాగా, ప్రస్తుతం ముంబయికి వ్యాపారవేత్తలు ఎక్కువగా క్యూ కడుతున్న నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ మరో సర్వీసును ప్రారంభించింది. ఈ రెండు విమానాలకు డిమాండ్ ఉండటంతో ఎయిరిండియా తన రెండో సర్వీసును నడపాలని యోచిస్తోంది. మే 1 నుంచి ముంబయికి రెండో సర్వీసును నడపనున్నట్టు విమానాశ్రయ అధికారులకు సమాచారం పంపింది. అయితే, ఈ ప్రతిపాదనను రద్దు చేసుకున్నప్పటికీ త్వరలో ఎయిరిండియా రెండో సర్వీసు నడిచే అవకాశాలు ఉన్నాయి. ముంబయికి వెళ్లేవారిలో ఎక్కువగా వర్తక, వ్యాపారులు, విద్యార్థులు, పర్యాటకులు ఉంటుండటంతో పోటీ ఎక్కువైంది.

బంటుమిల్లిలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు స్నేహితులు దుర్మరణం



శివప్రసాద్ (ఫైల్)



వీరాచారి (ఫైల్)

మచిలీపట్నం టౌన్/బంటుమిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి సమీపంలోని నారాయణపురం అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారి-216పై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. బంటుమిల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నానికి చెందిన వాసాబత్తుల వీరాచారి (38), అనకాపల్లి శివప్రసాద్ (37) స్నేహితులు. పనిమీద వీరిద్దరూ కలిసి శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై రాజమండ్రి వెళ్లారు. తిరిగి శుక్రవారం రాత్రి రాజమండ్రి నుంచి మచిలీపట్నం బయల్దేరారు. మార్గంమధ్యలో బంటుమిల్లి సమీపంలోని నారాయణపురం అడ్డరోడ్డు వద్దకు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వేగంగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. బంటుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులిద్దరిదీ మచిలీపట్నంలోని కరెంట్ కాలనీ. శివప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, వీరాచారికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పేదరికం, కుటుంబ పెద్దలను కోల్పోవడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ దహన సంస్కారాలు పూర్తి చేశారు.



బంటుమిల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు!

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు చోట్ల ఎంఎస్ఎంఈ ఐపీల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- గన్నవరం నియోజకవర్గం వీరపనేనిగూడెం, జగ్గయ్యపేట నియోజకవర్గం జయంతిపురం గ్రామాలు ఎంపిక
- ఒక్కో చోట 20 నుంచి 50 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో నియోజకవర్గ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్స్ (ఐపీ)లను ఏపీఐఐసీ అధికారులు ఖరారు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీఐఐసీకి లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి విడతగా 50 ఎంఎస్ఎంఈ ఐపీల ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు ఎంఎస్ఎంఈ ఐపీలను ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ అధికారులు నిర్ణయించారు. ప్రతి ఎంఎస్ఎంఈ ఐపీ కోసం 20 ఎకరాలు తక్కువ కాకుండా చూడాల్సిందిగా ప్రభుత్వం నిర్దేశించటంతో ఆ మేరకు చర్యలు చేపట్టారు. కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గం వీరపనేనిగూడెం ఇండస్ట్రియల్ పార్క్ వెంబడే ఫేజ్ -3లో ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైన భూముల లభ్యత ఇక్కడ ఉండటం వల్ల దీనిని అనువైనదిగా ప్రతిపాదించారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జయంతిపురం గ్రామంలో ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ ఏపీఐఐసీ పెద్దగా కష్టపడకుండానే భూములు అందుబాటులో ఉన్నాయి. ఈ భూముల దగ్గరకు చేరుకోవటానికి సరైన దారి లేదు. ఈ దారి సమస్యను ఏపీఐఐసీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రభుత్వం కనుక రహదారి పనులకు శాంక్షన్ ఇచ్చి.. భూసేకరణ చేయిస్తే జయంతి పురం ఎంఎస్ఎంఈ ఐపీకి ఢోకా లేనట్టే. తొలి దశలో ఈ రెండు చోట్ల ఎంఎస్ఎంఈ ఐపీలను ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లిన నేపథ్యంలో అనుమతులు రాగానే తదుపరి ప్రక్రియను చేపట్టనున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలకే ఈ ఎంఎస్ఎంఈ ఐపీలలో స్థానం కల్పిస్తారు. ఒక్కో ఎంఎస్ఎంఈలో సగటున 20 నుంచి 50 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయించనున్నారు. భౌగోళికంగా అనువైన యూనిట్లకే అవకాశం కల్పించాలని ఏపీఐఐసీ అధికారులు నిర్ణయించారు.

సాగరంలోకి 342 తాబేళ్ల పిల్లలు

◆ ఆలివ్ రిడ్లేలను సముద్రంలో విడిచిపెట్టిన జేసీ గీతాంజలి శర్మ



ఆలివ్ రిడ్లే పిల్లలను తీసుకెళ్తున్న జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అరుదైన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ సాగరంలోకి వదిలిపెట్టారు. శనివారం కుటుంబసమేతంగా హంసలదీవి శివారు పాలకాయితిప్ప బీచ్ వద్ద అటవీ శాఖ వారి సంరక్షణలో ఉన్న గుడ్ల సేకరణ, పునరుత్పత్తి కేంద్రాన్ని జేసీ సందర్శించారు. తాబేళ్ల గుడ్లను సేకరించి కృత్రిమంగా 45 రోజులు పొదిగించి 342 తాబేళ్ల పిల్లలను సిద్ధం చేశారు. వీటిని జేసీ కుటుంబసభ్యులతో కలసి సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ మన అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. సముద్రంలోని వ్యర్థాలను, కలుపు మొక్కలను తింటూ సముద్రపు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు ఈ తాబేళ్లు దోహదపడతాయన్నారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ విజయ మాట్లాడుతూ గత జనవరి నుంచి 50 వేల తాబేళ్ల గుడ్లను సేకరించి పాలకాయితిప్ప తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రం వద్ద పొదిగించామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు తొమ్మిది వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగమణి పాల్గొన్నారు. అనంతరం జేసీ గీతాంజలి శర్మ హంసలదీవి కృష్ణ పవిత్ర సంగమం ప్రదేశాన్ని సందర్శించారు.

ఫైనల్‌కు అమరావతి, రాజధాని మీడియా జట్లు

- ఉత్సాహంగా అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ టోర్నమెంట్
- ముగిసి సెమీ ఫైనల్ మ్యాచ్‌లు



సెమీ ఫైనల్‌లో విజయం సాధించిన రాజధాని మీడియా జట్టు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం బి.గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లో 8 వికెట్ల నష్టానికి 148 పురుగులు చేసింది. 149 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజధాని మీడియా జట్టు 18.1 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించి ఫైనల్‌కు చేరింది. ఏ.గ్రౌండ్‌లో జరిగిన మరో సెమీ ఫైనల్ మ్యాచ్ ఆలస్యం కారణంగా 12 ఓవర్లకే కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన రాయుడు మీడియా జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అమరావతి మీడియా జట్టు 113 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరింది. కేవలం ఒకే ఒక్క బాల్ మిగిలి ఉండగా అమరావతి మీడియా జట్టు విజయం సాధించడం విశేషం. ఆదివారం అమరావతి మీడియా, రాజధాని మీడియా జట్ల మధ్య ఫైనల్ పోరు జరుగనుంది.

సంపద సృష్టికర్త సీఎం చంద్రబాబు

- ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టికర్త సీఎం చంద్రబాబు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సీఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని ఎంపీ శివనాథ్ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు సంపద సృష్టికర్త, స్వర్ణాంధ్ర రథసారధి అని కొనియాడారు. ఆయన మాత్రమే భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించే ముఖ్యమంత్రి అని చెప్పారు. తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉంచటంతో పాటు, దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్‌ను ఉంచాలన్న సంకల్పంతో స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన కోసం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. పి-4 విధానంతో సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరిక నిర్మూలనకు సంకల్పించారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అలుపెరగని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, యువతకు ఉద్యోగ అవకాశాల కోసం పేదరిక నిర్మూలనకు రాత్రి, పగలు శ్రమిస్తున్న మహోన్నత నేత చంద్రబాబు అన్నారు.

'ఈ-వేస్ట్' నిర్ణయం విప్లవాత్మకం

-గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశానికే సవాల్‌గా మారుతున్న ఈ-వేస్ట్‌ను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు ఎక్కువ కలిగిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంటే, అమెరికా రెండవ స్థానంలో, మన దేశం మూడవ స్థానంలో ఉందని చెప్పారు. గన్నవరం మండలం బుద్ధవరం గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరిచేందుకు పంచాయతీలోనే సెంటర్‌లు ఏర్పాటు చేసినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఇంట్లో ఉంటే ఎన్నో అనర్థాలు వస్తాయని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో శారదా విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

గాంధీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2025 ఫలితాల్లో నగరంలోని శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారు. పసుమర్తి బిందుశ్రీ యశస్విని 88.22 శాతం మార్కులు సాధించి అడ్వాన్స్‌కు అర్హత సాధించింది. ఈమని శాండిల్ ప్రణవ కృష్ణ 83.73 శాతంతో ఉత్తమ పర్సెంటేజ్ సాధించినట్టు కళాశాల సెక్రటరీ కుందా రామనారాయణ, కరస్పాంటెంట్ ఎస్.ఎస్.వీ. వరప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని కళాశాలలో విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, విట్ వంటి ప్రఖ్యాత ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు పొంది కళాశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. ప్రిన్సిపల్ లుక్కా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- తన భూమి ఖాళీ చేయాలని యంత్రాలతో వెళ్లిన జనసేన నేత ఉదయభాను
- 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. ఖాళీ చేయబోమన్న ఆక్రమణదారులు
- అధికారుల జోక్యంతో తాత్కాలికంగా సర్దుమణిగిన వివాదం



జేసీబీని అడ్డుకుంటున్న ప్రజలు



మున్సిపల్ చైర్మన్‌కు వివరిస్తున్న మహిళలు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపురంలో జనసేన జిల్లా అధ్యక్షుడు భూమిలో ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు చిల్లకల్లు రోడ్డులో ఆర్ఎస్ నెంబర్ 345లో 13.60 ఎకరాల స్థలం ఉంది. ఎల్‌పైన్‌కు దరఖాస్తు చేసుకోగా 24 మంది సుమారు 20 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు తేలింది. వారిని ఖాళీ చేయాలని కోరగా నెల రోజులు గడువు కోరారు. గడువు పూర్తైన ఖాళీ చేయకపోవటంతో ఉదయభాను స్వయంగా యంత్రాలను పంపి తొలగింపునకు శ్రీకారం చేపట్టటంతో కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. 40 ఏళ్లుగా ఉంటున్నామని అప్పుడు లేనిది ఇప్పుడేంటని ప్రశ్నించారు. తొలగింపు వల్ల మరుగుదొడ్లు, బోర్లు, పోతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధితులు కౌన్సిలర్ అలేఖ్య, సైదాను ఆశ్రయించగా ఆక్రమణలను తొలగించవద్దని కోరారు. జగ్గయ్యపేట పోలీసులు, తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రలు అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారు ఆ స్థలాలకు ఉదయభాను బీఫారం పట్టాలు ఇప్పించారని ఇప్పుడు తనదే అనటం ఏంటన్నారు. మరోసారి కొలతలు వేసి నిర్ధారణకు వచ్చేంత వరకు ఆక్రమణల తొలగింపు నిలుపుదల చేయాలని చెప్పటంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

చర్లపల్లి - తిరుపతి మధ్య ప్రత్యేక రైలు నేడు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం వన్‌వే స్పెషల్ ట్రైన్‌ను ఆదివారం నడుపుతున్నట్లు డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం. మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో ఈ రైలు ఆదివారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ జంక్షన్, కొండపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, నెక్కొండ, వరంగల్, ఖాజీపేట జంక్షన్, జనగాం స్టేషన్ల మీదుగా చర్లపల్లి చేరుతుంది. 21వ తేదీ ఉదయం 6.10 గంటలకు చర్లపల్లి చేరుకునే ఈ రైలు విజయవాడ జంక్షన్‌కు ఆదివారం రాత్రి 11 గంటలకు వస్తుంది. రేణిగుంట జంక్షన్‌కు 5.15 గంటలకు, శ్రీకాళహస్తికి 5.38 గంటలకు, గూడూరు జంక్షన్‌కు 6.43 గంటలకు చేరుకుంటుంది. నెల్లూరుకు రాత్రి 7.14 గంటలకు, ఒంగోలుకు 8.38 గంటలకు, చీరాలకు 9.23 గంటలకు, తెనాలికి 10.18 గంటలకు చేరుతుంది. కాగా, ఆదివారం అర్ధరాత్రి తరువాత తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్, నెక్కొండ, వరంగల్, ఖాజీపేట జంక్షన్, జనగాం మీదుగా చర్లపల్లి చేరుకుంటుంది.

బస్సు దహనం కేసు నిందితుల విడుదలకు వినతి

గాంధీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత 32 ఏళ్లుగా జైలు జీవితం గడుపుతున్న చిలకలూరిపేట బస్సు దహనం కేసు నిందితులు సాతులూరి చలపతిరావు, గంటెల విజయ వర్ధన్‌రావులను విడుదల చేయాలని జీవిత ఖైదీల విడుదల సాధన సమితి నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హైకోర్టు న్యాయవాది డి.సురేష్ కుమార్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కరణం మురళీ మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులతోనే నిందితులు ఈ చర్యకు పాల్పడ్డారని గతంలో ఎటువంటి నేరాలు చేసిన చరిత్ర వీరికి లేదన్నారు. ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం జీవిత ఖైదీల విడుదల కోసం జారీ చేసిన జీవో 71లో చలపతిరావు, విజయవర్ధన్‌రావు విడుదలకు అడ్డుపడుతున్న గైడ్‌లైన్ ఉందన్నారు. దళితులైన వీరి పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో విడుదలకు ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 10లోపు 1, 1, 9, 10 ర్యాంకులు సాధించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ తెలిపారు. బందర్ రోడ్డులోని క్యాంపస్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విజయవాడ విభాగం నుండి ఆలిండియా ఓపెన్ క్యాటగిరీ 100వ ర్యాంకు లోపు ముగ్గురు విద్యార్థులు పిహెచ్ఎస్ఎస్.కార్తీక్ 75వ ర్యాంకు, పి.ప్రణయ సాయి ముఖేష్ 81వ ర్యాంకు, వి.ఈశ్వర్ కార్తీక్ 94వ ర్యాంకు సాధించారని తెలిపారు. అదేవిధంగా ఆలిండియా ఓపెన్ క్యాటగిరీ 500ర్యాంకు లోపు 24మంది, ఆలిండియా క్యాటగిరీ 100ర్యాంకు లోపు 41మంది విద్యార్థులు సాధించారని, ఇటువంటి విజయాలు ఒక్క శ్రీచైతన్య కి మాత్రమే సాధ్యమని అన్నారు. ఈ విజయానికి తాము నిర్వహించిన ప్రోగ్రామ్స్ కారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు,

ఉమ్మడి కృష్ణాకు 1,213 పోస్టులు

(9వ పేజీ తరువాయి)

ఆగ్రహానికి గురైంది. సరిగ్గా ఎన్నికల ముందు ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరలేపి గత ఏడాది ఫిబ్రవరి 9న నోటిఫికేషన్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేవలం 107 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చింది. హడావిడిగా నోటిఫికేషన్ ఇవ్వటంపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అభ్యర్థులకు అనుకూలంగానే ఆదేశాలిచ్చింది. కాగా, ఎన్నికల్లో కూటమి పార్టీలు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చాయి. ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. కిందటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 107 పోస్టుల కంటే పది రెట్లు ఎక్కువగా 1,213 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్‌ను ఇవ్వనుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము పరీక్షలకు సన్నద్ధం కావటం కోసం ప్రభుత్వం కోచింగ్ ఇప్పించాలని కోరుతున్నారు.

మే 15 వరకు దరఖాస్తులు

ఉపాధ్యాయ అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజులు కూడా అదే సమయంలో చెల్లించాలి. మే 20న మాక్ టెస్ట్ నిర్వహిస్తారు. 30న హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని పరీక్షలు పూర్తయిన రెండు రోజులకే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏడు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు తుది కీ, ఆ తర్వాత ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

ఉమ్మడి కృష్ణాలో న్యాయాధికారుల బదిలీ

విజయవాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలువురు న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎ.పద్మను అనంతపుర ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు, మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కె.అరుణను అవనిగడ్డ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలో మూడో అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఆర్.శాంతిశ్రీని శ్రీకాకుళం అదనపు సివిల్ జడ్జి కోర్టుకు మార్చారు. కృష్ణాజిల్లాలోని చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఎన్.రాజశేఖర్‌ను అనంతపురం జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. మచిలీపట్నంలోని అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి కె.జయలక్ష్మిని మదనపల్లి పిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు మార్చారు. నంద్యాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా ఉన్న బి.రాధారాణిని విజయవాడ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు మార్పు చేశారు. ఆత్మకూరు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న వెంకటేశ్వరరావును విజయవాడ మూడో అదనపు సివిల్ జడ్జి కోర్టుకు పంపించారు. శ్రీకాకుళం అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న సీహెచ్ యుగంధర్‌ను మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కేవీఎల్ హిమబిందును మచిలీపట్నం సివిల్ జడ్జి కోర్టుకు పంపారు. విజయనగరం జిల్లా బొబ్బిలి సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎస్.అరుణశ్రీని గన్నవరం అడిషనల్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావును ఏసీబీ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న జి.భూపాల్ రెడ్డిని కమర్షియల్ కోర్టుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వై శ్రీనివాసరావును ఏలూరులోని ఫ్యామిలీ కోర్టుకు పంపారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో వేధింపులు

(9వ పేజీ తరువాయి)

జమ చేయాలని షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో తరచూ తనకు మెమోలు జారీచేస్తుండటంతో సదరు ఉద్యోగి నెల పాటు సెలవు పెట్టారు. ఈ సెలవును అంగీకరించకుండా మళ్లీ నోటీసు జారీచేయడం గమనార్హం. మరో ఉద్యోగి తన తండ్రి చనిపోయిన కొద్దిరోజుల తరువాత ఒకరోజు సెలవు పెట్టారు. ఆ సెలవును మంజూరు చేయకపోవడంతో సదరు ఉద్యోగికి నెల జీతాన్ని నిలిపివేయడంతో పాటు నోటీసును జారీ చేయడంతో ఉద్యోగుల్లో ఈ అంశంపై చర్చ నడుస్తోంది. కార్యాలయంలో పనిచేసే మిగిలిన సిబ్బందినీ వివిధ కారణాలతో ఇబ్బందులపాలు చేస్తుండటంతో ఎవరికి వారు ఇక్కడ విధులకు హాజరుకావాలంటేనే భయపడిపోతున్నారు.

అవినీతి అధికారి దారి దోపిడీ

(9వ పేజీ తరువాయి)

పడ్డాడు. పాత ట్రక్కుకు రంగు వేయించి కొత్త చాసిస్ నెంబర్ బిళ్లను తగిలిస్తున్నాడు. కొత్తది కాబట్టి పాత డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒక్కో ట్రక్కుకు రూ.20 వేలు తీసుకుని కొత్తవాటిగా రాజముద్ర వేసి పంపుతున్నాడు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో దోపిడీ ఇలా..

ఈ సార్‌కు.. గుడివాడలో మరో కలెక్షన్ ఏజెంట్ ఉన్నాడు. ఇక్కడ పనిచేసే ఓ ఇన్‌స్పెక్టర్ ఏకంగా ట్రాక్టర్ ట్రక్కులపై ఎక్కువగా వసూలు చేసి సార్‌కు అందజేస్తున్నాడు. ఇక ఇసుక లారీల డబ్బు మామూలే. గన్నవరం నియోజకవర్గం కేంద్రంగా ఓ ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్‌ను ఈ సార్ మళ్లీ లైన్‌లోకి దించారు. ఇంతకుముందు ఈ ఏజెంట్ కేవలం కొందరు అవినీతి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల సేవలో ఉండేవాడు. ఈయన గన్నవరం ఎఫ్‌సీ స్టేషన్‌లో వాహనాలకు పెయింట్ వేసే పెయింటర్ దగ్గర పనిచేసే అసిస్టెంట్. కాలక్రమంలో కలెక్షన్ కింగ్ అవతారమెత్తాడు. ఈయన చేసే వసూళ్లకు గాను ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ కొంత కమీషన్‌ను కూడా ఇచ్చేది. ఈ ఏజెంట్ కలెక్షన్లు మరీ ఎక్కువ కావడంతో ఎంవీఐల సిండికేట్ సమావేశం పెట్టుకుని మరీ ఇతనిని తొలగించాలని నిర్ణయించింది. ఆ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ రెండు వర్గాలుగా విడిపోయి.. తొలగించాలని కొందరు, తొలగించొద్దని మరికొందరు పట్టుబట్టారు. ఆ తర్వాత కలెక్షన్ కింగ్‌ను పిలిచి హెచ్చరించి పంపేశారు. ఈ వ్యవహారం తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న ఆ ఏజెంట్ ఇప్పుడు మళ్లీ జూలు విదిల్చాడు. సార్ టార్గెట్లు ఎక్కువ కావటంతో ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ ఇతనిపై బండ పెట్టింది. దీంతో సదరు ఏజెంట్ బయటకు రాకుండా ఇంటి నుంచే లారీ యజమానుల నుంచి వసూళ్లకు తెగబడ్డాడు. ఉయ్యూరు ఆర్‌టీవో కార్యాలయ పరిధిలోనూ ఇదే వ్యవహారం నడుస్తోంది. ఓ ఇన్‌స్పెక్టర్ దిగువ అధికారి ఇక్కడ కలెక్షన్లకు శ్రీకారం చుట్టాడు. అలాగే, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల పరిధిలో కొందరు ఇన్‌స్పెక్టర్లు మెటల్, ఇసుక లారీ యజమానుల నుంచి వసూళ్లు చేస్తున్నారు.

గొల్లపూడిలో క్లోవర్ లీఫ్

(9వ పేజీ తరువాయి)

నున్న, జక్కంపూడి, గొల్లపూడి అవుటర్ ప్రాంతాలను కలుపుతూ రాజధాని అమరావతిలోని వెంకటాయపాలెం మీదుగా కాజ చేరుకుని అక్కడ ఎన్‌హెచ్-16కు అనుసంధానమవుతుంది. ఇది గొల్లపూడి దగ్గర ఎన్‌హెచ్-65ను క్రాస్ చేస్తుంది. ఇక్కడ ఎన్‌హెచ్-65పై ఆర్‌వోబీ వెళ్తుంది. ఇక్కడ గతంలో జరిగిన తప్పిదం కారణంగా కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విశాఖపట్నం, ఏలూరు నుంచి చిన అవుటపల్లి దగ్గర వెస్ట్ బైపాస్ మీదుగా వచ్చే వాహనాలు హైదరాబాద్ వెళ్లాలంటే ఆర్‌వోబీ పక్క నుంచి కిందకు దిగి.. గొల్లపూడి వెళ్లి అక్కడ ట్రాఫిక్ జంక్షన్ దగ్గర టర్నింగ్ తీసుకుని ఎన్‌హెచ్-65 మీదుగా ఇబ్రహీంపట్నం మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. చెన్నై నుంచి కాజ, విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా వచ్చే వాహనాలన్నీ విజయవాడ వెళ్లాలంటే గొల్లపూడి ఆర్‌వోబీ పక్క నుంచి దిగి ఇబ్రహీంపట్నం రింగ్‌కు వెళ్లి ఎన్‌హెచ్-65 మీదుగా వెనక్కి రావాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొద్దికాలం కిందట ఎన్‌హెచ్ అధికారులు గొల్లపూడి జంక్షన్ వద్ద ఒక రింగ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ రింగ్ జంక్షన్ కోసం కన్సల్టెంట్‌తో సర్వే చేయించారు. దీనివల్ల గొల్లపూడి దగ్గర బైపాస్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు కానీ, దిగువన ఉన్న ఎన్‌హెచ్-65పై రాకపోకలు సాగించే వాహనాలు బైపాస్ ఎక్కాలన్నా కానీ ఇబ్బంది లేకుండా ఉంటుంది. వాహనాలు కూడా ఇటు గొల్లపూడి సెంటర్, అటు ఇబ్రహీంపట్నం వెళ్లకుండానే రింగ్ జంక్షన్ మీదుగా అక్కడికక్కడే ఎటు కావాలన్నా వెళ్లే వీలుంటుంది. ఈ రింగ్ జంక్షన్‌కు పెద్దగా భూ సేకరణ కూడా అవసరం లేదని ఎన్‌హెచ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ రింగ్ జంక్షన్ పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాదనేది నిపుణుల మాట. కనీసం సగం క్లోవర్ లీఫ్ జంక్షన్ అయినా ఏర్పాటు చేయాల్సిందేనని వారు ప్రతిపాదిస్తున్నారు. అయితే, దీనికి కూడా భూసేకరణ తప్పదని ఎన్‌హెచ్ వర్గాలు భావించి ఆ ప్రతిపాదనను విరమించుకున్నాయి. కాగా, అనూహ్యంగా సగం క్లోవర్ లీఫ్ జంక్షన్ ప్రతిపాదన పక్కకుపోయి పూర్తిస్థాయి క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ఏర్పాటుచేసే పరిస్థితి ఏర్పడింది.

ఎన్‌హెచ్-65 ఆరు వరసల ప్రతిపాదన నేపథ్యంలో..

ప్రధానంగా హైదరాబాద్-విజయవాడ వరకు ఎన్‌హెచ్- 65ను ఆరు వరసలుగా విస్తరించాలని నిర్ణయించటమే కారణం. డీపీఆర్ రూపకల్పన ప్రక్రియ కూడా వేగంగా శ్రీకారం చుట్టడంతో క్లోవర్ లీఫ్ జంక్షన్ అంశంపై ఎన్‌హెచ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రెండు భారీ జాతీయ రహదారులు అనుసంధానమయ్యేచోట, అందునా ఆరు వరసలుగా క్రాస్ అవుతున్న దగ్గర కచ్చితంగా క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయకపోతే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాజధానికి సమీపంలో ఇలాంటి ట్రాఫిక్ తలనొప్పులు మంచిది కాదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీంతో హైదరాబాద్-విజయవాడ మార్గంలో 6 వరసల విస్తరణ డీపీఆర్‌లో క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ప్రతిపాదించే అవకాశం కనిపిస్తోంది. ఈ జంక్షన్ ఏర్పాటు చేయాల్సి వస్తే భూ సేకరణ తప్పదు. గొల్లపూడిలో అత్యంత ఖరీదైన భూములను సేకరించాల్సి ఉంటుంది.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్‌వోడీ డాక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్యకళాశాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక నారాయణ పాఠశాలలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వంశీ, పాఠశాల ప్రిన్సిపాల్ బాషా, అనూష, శిరీషా, నవీన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకుగాను నున్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మోడల్ హౌసింగ్ కాలనీలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం వజ్రాల భూపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల విజయభేరి



విజేతలతో డీజీఎం రవిశంకర్, డీన్ శ్రీరాంచంద్ చౌదరి

పెనమలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు. కానూరు నారాయణ క్యాంపస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన విజేతలయిన విద్యార్థులు, డీన్ శ్రీరాంచంద్ చౌదరి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మాట్లాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరి బనిబ్రత మజీ అనే విద్యార్థి 300 మార్కులకు గాను 300 సాధించి మొదటి ర్యాంకు, శివన్ వికాస్ 9వ ర్యాంకు, పదిలోపు వివిధ కేటగిరీలలో 1, 2, 2, 4, 4, 7, 9, 10 ర్యాంకులు సాధించారని తెలిపారు. విజయవాడ నారాయణ విద్యార్థులు వడ్లమూడి లోకేష్ 183వ ర్యాంకు, తోరాటి భరద్వాజ్ 237, కృష్ణ హర్షిత్ 296, వెంకట రఘువీర్ 360, మహేశ్వరరెడ్డి 484, చంద్రేష్ 586, రాచపూడి సాయికృష్ణ 622, ఆముదాల భార్గవ్ 706, బిందుమాధవి 744, జస్వంత్‌రెడ్డి 777, ఆంజనేయరెడ్డి 827, లిఖితశ్రీ 927, వసంత ద్రిషిని వాహన 949, సాయి శివరామకృష్ణ 955 ర్యాంకులు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీలలో 13, 24, 30, 38, 62, 77, 85, ఓపెన్ కేటగిరీలో 14మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు, 2వేల లోపు 34మంది, మూడువేల లోపు 47, ఐదువేల లోపు 58, పదివేల లోపు 96మంది, ఇరవైవేల లోపు 165మంది రికార్డు స్థాయిలో ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని రవిశంకర్ తెలిపారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు



విజయవాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నున్న సమీపంలోని పశ్చిమ బైపాస్‌పై శనివారం ఓ కారు ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాల పాలైయ్యారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన పాము కాసుబాబు(41) కుటుంబ సభ్యులతో కలిసి తన కారులో కాకినాడలోని బంధువుల ఇంటికి వెళుతున్నాడు. విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా నున్నగ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ దిమ్మలకు ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భార్య శిరీషకు తీవ్ర గాయాలవ్వగా, అతని కుమారులు స్వల్ప గాయాల పాలైయ్యారు. నున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సామాజిక ప్రయోజనాలు చేకూర్చే వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన వైపు విద్యార్థులు దృష్టి సారించాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో ఈఈఈ ఫైనలియర్ విద్యార్థుల ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక బృందంతో కలిసి సందర్శించారు. ఈఈఈ విభాగాధిపతి కె.నరేష్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



ఉయ్యూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గౌతు లచ్చన్న 19వ వర్ధంతి పురస్కరించుకుని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు, లచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ, పామర్తి శివ, సుబ్బారావు, కుటుంబరావు, సంజయ్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేయండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కంకిపాడులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు

కంకిపాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రచారం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంకిపాడు పంచాయతీ కార్యా లయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రధాన రహదారిపై చీపురు పట్టి రోడ్డు ఊడ్చారు. అనంతరం కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాకి రమణ, రాచూరి చిరంజీవి, తుమ్మలపల్లి హరికృష్ణ, పులి కామేశ్వరరావు, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, అన్నవ రపు శివపార్వతి, డీఎస్‌ఆర్, వీరంకి శ్యామ్, చిట్టూరి నాగేశ్వరరావు, సుంకర శివ, నాగశ్రీ, కె. నాని తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : మండల పరిధి గ్రామాల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వి సత్యనారాయణ, కమిషనర్ పి వెంకటేశ్వరరావు మసీదు సెంటర్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు ప్రజలకు తెలియ చేసి స్వచ్ఛాంధ్ర పతిజ్ఞ చేయించారు. కాటూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగి రిరావు, ఈఓపీఆర్డీ గ్రామ కార్యదర్శి సుబ్బారావు, సర్పంచ్ ఆశాజ్యోతి, శేషవరప్రసాద్, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొని ర్యాలీ, మానవ హారం నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే ఆరోగ్యవంతమైన సమాజం, ఆరోగ్యవంతమైన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బాపులపాడు ఎంపీపీ వై. నగేష్ అన్నారు. శనివారం బాపులపాడులో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీడీవో జోగేశ్వరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరానమెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్ సూచించారు. మల్లవల్లి పారిశ్రామికవాడలోని ఆశోక్‌లేలాండ్ యూనిట్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీధరన్, గోపినాధ్, సాంబశివరావు, తదితరులతో పాటు 400 మంది కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మడిచర్లలో నాటుసారా అనేది లేకుండా ప్రజలందరి సహకారంతో సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని ఎక్సైజ్ సీఐ సురేఖ అన్నారు. మడిచర్లలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ఎంపీపీ స్కూల్ ప్రాంగణాన్ని శుభ్రపరచారు.

ప్రసాదంపాడు : స్వర్ణాంధ్ర-2047 సంకల్పంతో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఈ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, వ్యర్థాల నిర్వాహణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సవాళ్లను పరిష్కరించడంలోనూ రీసైక్లింగ్ విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్ జి.జ్యోతి అన్నారు. శనివారం నిడమానూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సుగుణ, ఎం.పీ.డీ.వో మురళీకృష్ణ,డీఫ్యూటీ ఎం.పీ.డీ.వో దుర్గాప్రసాద్, సర్పంచ్ శీలం రంగారావు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, వెటర్నరీ డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సవ పందిరి నిర్మాణానికి విశేషపూజలు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ పందిరి రాట

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మే 17 నుంచి 22 వరకు నిర్వహించ నున్న హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం ఉత్సవ పందిరి నిర్మాణానికి ప్రారంభ పూజలు నిర్వహించి ముహూర్తపు రాట ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవ పందిరి నిర్మాణానికి సంబంధించి ఆలయ ప్రధాన అర్చకులు సీతారామా నుజచార్యులు ప్రారంభ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, వీరమాచనేని సత్యప్రసాద్, సుంకర సుభాష్ చంద్రబోస్, మట్టా శ్రీను, వడ్డి వాసవి, వేగిరెడ్డి పాపారావు, తాడి రంగారావు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి



జాస్తి శ్రీధర్

గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయి నుంచి టీడీపీని మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న అన్నారు. పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికలో శనివారం టీడీపీ టౌన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ టౌన్ అధ్యక్షుడిగా జాస్తి శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టౌన్ నూతన కమిటీ ఎంపిక పరిశీలకులుగా బోడపాటి రవికుమార్ వ్యవహరించారు. ఈ సమా వేశంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు, టీడీపీ సీనియర్ నాయకుడు బోస్ పాల్గొన్నారు.



గీతామందిరంలో కుంభాభిషేకం

విజయవాడ రూరల్ : నున్నలోని గీతా మందిరంలో శ్రీకృష్ణ విగ్రహం ప్రతిష్ఠాపన జరిగి పుష్కరం పూర్తైన సందర్భంగా ఆలయంలో చేపట్టిన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం మహోత్సవాలు శనివారం ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాలకు ఏర్పేడు పీఠం ఉత్తారిధికారి అసంఘానందగిరి హాజరై పూజా కార్యక్ర మాలు పర్య వేక్షించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్ : అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జి. ఆర్.మోహనరావు సూచించారు. మల్లవల్లి పారిశ్రామిక వాడ, పీహెచ్‌సీ, పెట్రోల్ బంకుల్లో శనివారం అగ్ని మాపక ఉపకరణాల వాడకంపై అవగాహన కల్పించారు.

పెద ఓగిరాలలో చోరీ

ఉయ్యూరు : పెద ఓగిరాలలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెద ఓగిరాలకు చెందిన మర్రెడ్డి మాధవి శుక్రవారం తన ఇంటి తలుపు తాళం వేసి వరండాలో నిద్రించింది. తలుపు పగలు కొట్టి ఇంట్లోని 40గ్రాముల బంగారం, కొంత నగదు పోయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎస్‌పీఎస్ విద్యార్థులు

గుడివాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఈనెల 16వ తేదీ విజయవాడలో జరిగిన జూనియర్ ఖో-ఖో పోటీల్లో స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన డి.రాకేష్, టి.తిమోతి, సాజిద్‌ఖాన్, బి.జయసూర్యతేజలు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో వారిని అభినందించారు. ఖో-ఖో అసోసియేషన్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అధ్యక్ష,కార్యదర్శులు మద్దినేని సత్యప్రసాద్, మడకాప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శొంఠి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన ఎస్‌పీఎస్ విద్యార్థులు

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పామర్రులో...

పామర్రు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలోగల భవిత సెంటర్లో శనివారం నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సమగ్రశిక్షాభియాన్ నుంచి మంజూరైన ఉపకరణాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మె ల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమల్జేస్తోందన్నారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన కాలిపర్స్, చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్ల,బ్యాటరీ బైకులు, మోటారుబైకులు తదితర ఉపకరణాలను అందజేస్తున్నామన్నారు. ప్రతిభ ఉన్నవారికి అంగవైకల్యం అడ్డు కాదని స్పష్టంచేశారు. మొత్తం ఐదుమండలాలకు చెందిన 26మంది విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు రూ. 2.30లక్షల విలువైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టు అదనపు డైరక్టర్ ముదిగొండ ఫణి దూర్జేటి, మండల విద్యాశాఖ అధికారిణి గుమ్మడి పద్మవాణి, ఐఈఆర్‌టీ టీచర్లు మరియన్న, వాణి, దుర్గాభవానీ, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, దాలిపర్తి ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

గుడివాడ : రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యాశాఖలో వినూత్న కార్యక్రమాలను అమల్జేస్తున్నారని టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, దింట్యాల రాంబాబులు అన్నారు. విద్యాశాఖ, సర్వశిక్ష జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరతలు కలిగిన విద్యార్థులకు శనివారం స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడివాడ నుంచి ఐదుగురు, గుడ్లవల్లేరు నుంచి ఎనిమిది, నందివాడలో ఇద్దరు విద్యార్థులకు వీల్‌చైర్స్, మేథో వైకల్యం కలిగిన విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నరసమాంబ, సర్వశిక్ష అభియాన్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..



గుడివాడలో..

పెదపారుపూడి: పెదపారుపూడిలోని ఎంఆర్‌సీలో సమగ్ర శిక్ష మచిలీపట్నం ఆధ్వర్యంలో ఏపీసీ ఫణి దూర్జటి ప్రత్యేక అవసరాలు గల బాలలకు వివిధ రకాల ఉపకరణాలు అందించారు. ఎలమర్రుకు చెందిన మట్ట సంజయ్ బాబుకు వీల్ చైర్, జమ్మిదింటకుర్రు గ్రామానికి చెందిన షేక్ కాలేషా మస్తాన్‌కు బ్యాటరీతో నడిచే వీల్ చైర్, వానపాములకు చెందిన స్రవంత్ కుమార్‌కు రోలేటర్ అందజేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ సైక్లింగ్‌పై అవగాహన



తోట్లవల్లూరులో స్వచ్ఛాంధ్ర కోసం ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలో 21 గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ తెలిపారు. నెలలో మూడో శనివారం కార్యాలయాల్లో ఉన్న కంప్యూటర్లు, విడి భాగాలు అన్ని శుభ్రపరిచి, పాడైనవి బయట వేయటం జరుగుతుందన్నారు.

పమిడిముక్కల : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధి గ్రామాల్లో ఎలక్ట్రానిక్ వేస్ట్ సేకరణపై అవగాహన ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. కపిలేశ్వరపురంలో జరిగిన ఈవేస్ట్ రీసైక్లింగ్‌లో అవగాహన కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల వైస్ ఎంపీపీ మహేశ్ , హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొని ప్రదర్శన నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పాడైన మొబైల్‌ఫోన్లు, టీవీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఈ కేంద్రాల్లో అందజేయాలని ప్రచారం చేశారు.

పెదపారుపూడి: ప్రభుత్వం నిర్దేశించిన ఏ లక్ష్యమైనా ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే సఫలీకృతం అవుతుందని పెదపారుపూడి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంగా శ్రీనివాస్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావులపాడు, గుర్విందగుంట, పెదపారుపూడి, యలమర్రు, ఈదులమద్దాలి గ్రామాల్లో పర్యటించి వివిధ స్వచ్ఛతా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. రావులపాడులో స్వచ్ఛత ప్రతిజ్ఞ, గుర్విందగుంటలో మానవహారం నిర్వహించారు. పెదపారుపూడిలో ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేంద్ర చౌదరి, మహిళా పోలీస్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న జెడ్పీస్కూల్ విద్యార్థులు



పెదపారుపూడిలో ఈ వేస్ట్ కలెక్ట్ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్

తోట్లవల్లూరు : పాడైన ఎలక్ట్రిక్ వస్తువులను దీర్ఘకాలంగా ఇంట్లోనే అట్టిపెట్టుకోవటం వల్ల కాలుష్యంతో పాటు అనారోగ్యాలు సంభవిస్తాయని, అందుచేత వాటిని ఇంటి నుండి ఖాళీ చేయటంమేలని అధికారులు సూచించారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శనివారం ఎలక్రిక్టక్ వేస్ట్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలు సేకరించిన ఎలక్ట్రిక్ వేస్ట్ వస్తువులను శనివారం తరలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కోసం నాయకులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, డీఎల్‌పీవో, మండల ప్రత్యేకాధికారి రాజేష్, గ్రామ సర్పంచ్ పెనుముత్స రాధిక, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్డి వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి రవికుమార్, వెలుగు ఏపీఎం సాంబశివరావు, అన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నివారణచర్యలు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుడివాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : సరైన అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించడంతో పాటు ప్రమాద తీవ్రతను సైతం తగ్గించవచ్చునని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి జె.ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రులలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద మాల్ సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కార్యాలయం వద్ద స్టార్ ఫ్మారశీ, స్టార్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. అగ్నిప్రమాదాల్లో ఎదుర్కొనే సిబ్బంది ఎక్కువగా పొగ పీల్చడం వల్ల వారికి ముందస్తుగా ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా రక్తపరీక్షలు నిర్వహించినట్లు ఫార్మశీ అధినేత డి.ఎన్ శివరాం తెలిపారు. డయాగ్నోస్టిక్ సిబ్బంది జున్నాల్, కీర్తి, మంజువాణి పాల్గొన్నారు.

కార్యదర్శి ఫిర్యాదుతో ఇరిగేషన్ భూమి సర్వే

నందివాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ భూమి సర్వే చేయించిన ఘటన జనార్థనపురంలో చోటుచేసుకుంది. జనార్థనపురం విష్ణువిలాస్ ప్లాట్లలో ఇరిగేషన్ భూమి కాలువ వద్ద ఆక్రమణకు గురైన స్థలాన్ని వీఆర్వో శేఖర్, గ్రామ సర్వేయర్ సూయమ భానులు శనివారం సర్వే నిర్వహించారు. 67 సర్వే నెంబర్ 1.62 సెంట్ల భూమి మొత్తం ఆక్రమణలో ఉందని, ఒక మూల ఖాళీగా ఉంటే రెండు సెంట్లు ఇల్లు వేసుకున్నానని దళిత మహిళ దేశమాల రోజా పుష్పం తెలిపారు. ఆక్రమణలోని భూమి అంతా కొలవకుండా రోజా పుష్పం ఇల్లు వేసుకున్న స్థలమునే సర్వే చేస్తామని మిగిలినది ఇప్పుడు చేయం అంటూ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. సర్వే నెంబర్ 67 మొత్తం సర్వే చేయాలని దళిత మహిళ రోజా పుష్పం పట్టు పట్టడంతో ఏఈ పవన్ కుమార్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై శ్రీనివాస్ అక్కడకు చేరుకుని ఫిర్యాదు పెట్టిన సర్వే నెంబర్ 67 మొత్తం సర్వే చేయాలని సూచించారు. దీంతో ఏఈ పవన్ 67 సర్వే నెంబర్ మొత్తం సర్వే చేయించి ఫ్లగ్ మార్కులు వేశారు.



ఎస్సైతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ పవన్

అనంతరం ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సందీప్‌ను వివరణ కోరగా జనార్థనపురం గ్రామస్థులు ఫిర్యాదు చేయటంతో ఆ భూమి ఇరిగేషన్ భూమి అని తెలుసుకుని ఇరిగేషన్ ఏఈకి తెలియపర్చానన్నారు. ఇరిగేషన్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా, భూమి అంతా ఆక్రమణకు గురి అవ్వటంతో సర్వే నిర్వహించామన్నారు. భూమిలో ఉన్న ఆక్రమణదారులందరికీ రెండు రోజులలో నోటీసులు ఇచ్చి ఖాళీ చేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మండల సర్వేయర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న ఆశయాలు నెరవేర్చాలి

కూచిపూడి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు సంఘ సంస్కర్త సర్థార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులు పేర్కొన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమాన్ని కాజలో ఘనంగా నిర్వహించారు.

గుడివాడ : సర్థార్ గౌతులచ్చన్న వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక పాత సంతబజారు రోడ్డులోని సర్థార్ గౌతులచ్చన్న విగ్రహానికి ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళలర్పించారు.

తోట్లవల్లూరు : గౌతు లచ్చన్న జీవితం అందరికి ఆదర్శనీయమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. రొయ్యూరులో శనివారం సర్థార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ముఖ్యఅతిధులుగా హాజరై గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

చిన్నారులకు భోజన వసతి

గుడివాడ : మందపాడులోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఆనందాసు నిరుపతమ, నిహారికల జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆనందాసు కుటుంబసభ్యులు వృద్ధులకు భోజనవసతి కల్పించారు. టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గోపిక, ఆనందాసు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడి మృతి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెం కేఈబీ కెనాల్ లాకుల దగ్గర చేపలు పట్టేందుకు వచ్చి ప్రమాదవశత్తు కాలువలో జారిపడి తాపీ కార్మికుడు మృతిచెందాడు. ఉయ్యూరుకు చెందిన షేక్ రబ్బానీ(35) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం గేలంతో చేపలు పట్టుకు వస్తానని ఇంటివద్ద చెప్పి వల్లూరుపాలెం కేఈబీ కెనాల్ లాకుల వద్దకు వచ్చాడు. లాకుల వద్ద గేలం వేస్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. రబ్బానీ తిరిగి ఇంటికి రాకపోవటంతో శనివారం రబ్బానీ భార్య మున్వర్ సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాలువలో గాలించగా రబ్బానీ మృతదేహం లభ్యమయిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసెస్

గుడివాడ : ఈస్టర్‌పండుగను పురస్కరించుకుని స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్సీఎం చర్చి వద్ద ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.శ్యాంబాబు ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్సీఎం చర్చి వద్ద నుంచి సత్యనారాయణపురంలోని ఫుల్ గాస్పెల్ చర్చి ఆఫ్ ఇండియా వరకు విశ్వాసులు ర్యాలీ నిర్వహించారు. బిషప్ అప్పికట్ల జాషువా, న్యాయవాది చిలుకోటి రాజేంద్రప్రసాద్, పాస్టర్లు జి.ఏ శేఖర్, యేహేజ్కేలు, ఇస్సాక్, పాల్గొన్నారు.

స్టేడియం క్రీడాకారులకు పతకాలు

గుడివాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11 నుంచి 17వతేదీ వరకు పంజాబ్‌లోని మొహాలీలో జరిగిన రెండో అంతర్ రాష్ట్ర ఓపెన్ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో స్థానిక స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు కెడెట్ 7-11 బాలికల విభాగంలో వి.ఆశిత, కె.కారుణ్యశ్రీ, జి.దివిష, కె.వైష్ణవిలు కాంస్య పతకాన్ని సాధించినట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక స్టేడియం కమిటీ కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. పతకగ్రహీతలు, కోచ్ రాజాలను కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ తదితరులు అభినందించారు.

రైలు నుంచి జారిపడి మహిళకు తీవ్ర గాయాలు

గుడివాడ : సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం వెళుతున్న బీదర్ ఎక్స్‌ప్రెస్ నుంచి శనివారం గుడివాడ-దోసపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో ప్రమాదవశాత్తు జారిపడి రాళ్ళపల్లి నిర్మల అనే మహిళ గాయాలపాలైనట్టు రైల్వే ఎస్సై మహబూబ్ తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఆమెను స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన నిర్మలను ఆమె కుమార్తెకు అప్పగించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి ఒకరి మృతి


వెంకన్న (ఫైల్)

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చిట్టిపాలెం గ్రామంలో ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి పల్లపోతు వెంకన్న (55) మృతి చెందాడు. తన స్నేహితుడు రంగాతో కలిసి వెంకన్న చెట్టెక్కి కొబ్బరికాయలు కోస్తుండగా అవి చెరువులో పడ్డాయి. చెరువులో పడిన కొబ్బరికాయలను ఇద్దరూ బయటకు తీస్తుండగా వెంకన్న నీటి లో మునిగిపోయాడు. వెంకన్నను రంగా బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకన్న మృతదేహానికి మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామానగరం- ఘంటసాల రోడ్డుకు రూ.5కోట్లు మంజూరు

ఘంటసాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రామానగరం - కొడాలి వయా ఘంటసాల రోడ్డు నిర్మాణానికి ఐదు కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. దేవరకోట గ్రామానికి కూటమి నేతలతో కలసి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చల్లపల్లి మండలం రామానగరం నుంచి ఘంటసాల మండల పరిధిలోని దేవరకోట, ఘంటసాల, ఘంటసాపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి, కొడాలి వరకు ఉన్న డబుల్ లైన్ రోడ్డు దెబ్బతిని ఉన్న అన్ని చోట్ల నూతన తారు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. దేవరకోట గ్రామానికి చెందిన ప్రముఖ రైతు వేమూరి రత్నగిరిరావు మనుమడు జిష్ణు వర్ధన్ (తలశిల శ్రీకాంత్ - సుధారాణిల కుమారుడు) నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు అందజేశారు. తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, దండమూడి శివనాగేశ్వరరావు, పరిశె చలపతి, దోనేపూడి శ్రీనివాస్ (బుజ్జి) పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వర్మీకంపోస్టు

ఘంటసాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామ పంచాయతీ వర్మీకంపోస్టు ఎరువును రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. గత కొన్ని రోజులుగా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టును తయారు చేశారు. ఎరువు తయారు కావటంతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి 50 కేజీల వర్మీ కంపోస్టును విక్రయించారు. సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో క్రీడాకారులకు వెయిటేజీ కొనసాగించాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకంలో వ్యాయామోపాధ్యాయుల భర్తీకి సంబంధించి క్రీడాకారులకు ఉన్న వెయిటేజీని కొనసాగించాలని ఏపీ వ్యాయాయ విద్యాపోరాట సమితి నాయకులు దేవేందర్ గౌడ్, చల్లయ్య డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరిలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సిలబస్ మార్పు చేయటంతోపాటు క్రీడాకారులకు వెయిటేజీ తీసేశారని, దీంతో క్రీడాకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికే తాము విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు.



రామాలయంలో మండల పూజామహోత్సవం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జోశ్యులవారితోటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట అనంతరం శనివారం మండల పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో శనివారం నారాయణ హోమం నిర్వహించారు. మండల పూజలు, స్వామి వారికి అభిషేకాలు జరిపారు. గొర్రె వెంకట హరిబాబు, డి.మస్తాన్‌బాబు, బుద్దన నాగవెంకటకిషోర్, కొలసాని శ్రీహరి దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ఐపీసీ కరుణ కుమార్‌ను కలిసిన మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని

రైతుల సంక్షేమంపై దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐపీసీ కరుణకుమార్ అన్నారు. శనివారం కరుణ కుమార్, టీడీపీ తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్‌ను మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని మర్యాద పూర్వకంగా కలిశారు. రైతుల సమస్యలపై నాయకులు చర్చించారు.


స్వచ్ఛతా ర్యాలీలో మాట్లాడుతున్న బండి రామకృష్ణ


కానూరులో వీధులు శుభ్రం చేస్తున్న గోపు


చల్లపల్లిలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. సర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం స్వచ్ఛ దివస్ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మచిలీపట్నం నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు చీపుళ్లు పట్టుకుని తమ కార్యాలయాలు, వీధులను శుభ్రం చేశారు. డ్రెయిన్లలో పూడికతీశారు. ఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బంది, కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కళాశాల ప్రొఫెసర్ సుందరకృష్ణతో పాటు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరవీధుల్లో కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని చెత్తను తొలగించారు. కమిషనర్‌తో పాటు సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్, జనసేన నాయకుడు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. డ్రైన్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలను పి.వి. ఫణికుమార్‌తో పాటు పారిశుధ్య కార్మికులు తొలగించారు. కానూరులో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. గ్రామ వీధులను చీపుర్లు పట్టుకుని శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిహెచ్. అయ్యప్ప, గోపు వెంకటరమణ, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్యాంపుబెల్‌పేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. **గూడూరు** : గూడూరు గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఎంపీపీ సంగా మధుసూధనరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి, తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ వనజ, ఈవోపీఆర్‌డి రాజేశ్వరి, సత్యప్రియ, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **పెడన** : పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎం. గోపాలరావు మునిసిపల్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. కౌన్సిలర్ కటకం ప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు. **పెడన రూరల్** : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ విద్యార్థులు కళాశాలలో ఈ వేస్ట్‌ను సేకరించారు. కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ఈడీ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి, ఎస్‌వికె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : పర్యావరణానికి హానికలిగించే క్యారీ బ్యాగ్‌ల వాడకం మానివేసి చేతిసంచులనే వినియోగించాలని చల్లపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో వి.రవిశంకర్ సూచించారు.


నందమూరులో ఈ-వేస్ట్ సేకరణ


ఘంటసాల పాలెంలో ర్యాలీ

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ దుకాణదారుల నుంచీ ఈ వేస్ట్‌ను సేకరించారు. ప్రధాన సెంటర్లో వివిధ దుకాణదారులకు, ప్రజలకు చేతిసంచులను అందజేశారు. గ్రామ పంచాయతీ, సచివాలయాలను పరిశుభ్రపరిచారు. ఏపీఎం కె.శ్రీనివాసరావు, ఈవో పివి.మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశరావు, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓఏలు, డ్వాక్రా సంఘ మహిళలు పాల్గొన్నారు.చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, శ్రమదానం నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఈ వేస్ట్ గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.శ్రీనివాస్, డాక్టర్ దుర్గా శైలజా రెడ్డి, డాక్టర్ సుమా చౌదరి, డాక్టర్ బి.వంశీ పవన్, సిబ్బంది పాల్గొన్నారు. **ఘంటసాల** : మండలంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించి, ఈ-వేస్ట్ సేకరించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం కూలీలను కలసి తడి, పొడి చెత్తను సేకరణపై సూచనలు చేశారు. ఘంటసాలపాలెంలో జరిగిన ర్యాలీలో సర్పంచ్ దోనె రజని, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోలెం అర్జునరావు, గ్రామ ప్రముఖులు దోనె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గ్రామ పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **మోపిదేవి** : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని సచివాలయాలు, దేవాలయాలు పరిశుభ్రం చేశారు. ఈ-వేస్ట్ సేకరణపై అవగాహన ర్యాలీ నిర్వహించి స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేశారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలు సహకరించాలని ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీడీవో జె.స్వర్ణభారతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత గౌతు లచ్చన్న

● వర్ధంతి సందర్భంగా కొనకళ్ల తదితరుల నివాళి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కార్యదక్షతకు, సాహసానికి మారుపేరైన సర్దార్ గౌతు లచ్చన్న అందరికీ ఆదర్శమని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లోని గౌతు లచ్చన్న విగ్రహానికి శనివారం కొనకళ్ల నారాయణరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదివాడ రాము, గడ్డం రాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబా ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, గోపు సత్యనారాయణ, హసీంబేగ్, కాగిత వెంకటేశ్వరరావు, బత్తిన దాసు, కాగిత గోపాలరావు, కుక్కల సత్యనారాయణ, గోకుల్ శివ, తలారి సోమశేఖర్, ఇలియాస్ బాషా, పివిఫణికుమార్ , కాసాని భాగ్యారావు, కట్టా అంజిబాబు, కరెడ్ల సుశీల, లంకిశెట్టి నీరజ, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్ , యార్లగడ్డ సీతారామయ్య, గుమ్మడి విద్యాసాగర్, పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి కె.వి.వి. సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కోడూరు** : బీసీ సంఘం సీనియర్ నాయకులు అద్దంకి పాండురంగారావు ఆధ్వర్యంలో గొల్లపాలెం సెంటర్‌లో గౌతు లచ్చన్న చిత్రపటానికి బీసీ సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండవీటి సురేష్, వేముల వేలాద్రి, కాగిత రామారావు, కాగితాల సుదర్శన్, అద్దంకి కృష్ణ, మునగాల వెంకట స్వామి, మేడా శివాజీ, దేవనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మండలి వెంకట్రామ్, జనసేన, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో గౌతు లచ్చన్న వర్ధంతి నిర్వహించారు. కర్రా సుధాకర్, బచ్చు రఘునాథ్, లుక్కా వెంకట పిచ్చియ్య, బండే రాఘవ, పుప్పాల ఏసు, మేడికొండ విజయ్, మండలి రామ్మోహనరావు, మెగావత్ గోపి తదితరులు పాల్గొన్నారు. **పెడన** : టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పారావు, బీజేపీ అధ్యక్షుడు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, సీపీఐ నేత కట్టా హేమ సుందరరావు,సీపీఎం నేత పంచల నరసింహారావు, జనసేన నాయకుడు పత్తిపాటి జయకృష్ణ, బీసీ నాయకులు బెజవాడ నాగరాజు, పడమట బలరామ్ లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించారు.

మోపిదేవి ఆర్ఐగా విశ్వనాథ్

మోపిదేవి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండల ఆర్ఐగా కెవికె.విశ్వనాథ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై మోపిదేవి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి-2 వీఆర్వోగా పని చేస్తున్న శివరామ ప్రసాద్ పదోన్నతిపై మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లినట్లు తహసీల్దార్ శ్రీ విద్య తెలిపారు.

డాక్టర్ జగదీష్‌కు వేదవ్యాస్ పరామర్శ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పితృవియోగానికి గురైన డాక్టర్ జగదీష్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ శనివారం పరామర్శించారు.

ఆర్థిక సాయం

పెడన రూరల్, ఏప్రియల్ 19 (ఆంధ్రజ్యోతి) : నందమూరు గ్రామానికి చెందిన జన్ను కోటేశ్వరరావు భార్యా నాగమణి శనివారం మరణించింది. విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచి కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియ ఖర్చుల నిమిత్తం ఆమె మనుమడు సురేష్‌కు ఐదువేల రూపాయలు అందించారు. పుట్టి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన

గూడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలులోని గర్భిణీలకు పౌష్టికాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహనత్రినాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మల్లవోలు సెక్టార్ సూపర్‌వైజర్ జయరేవతి, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం భవానీ, గోవాడ ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.



మారెమ్మ సంబరాలు ప్రారంభం

చల్లపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మేకావారిపాలెంలో రావి వారి ఇలవేల్పు శ్రీమారెమ్మ తల్లి సంబరాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పూజలు చేసి అమ్మవారి ఘటం బిందెలను రావి కుటుంబీకులు శిరస్సున ధరించి గ్రామంలో సంచరించారు. భక్తులు అమ్మవారికి వారపోసి పసుపు కుంకుమ సమర్పించారు. రావి కుటుంబీకులు సంబరంలో పాల్గొనేందుకు గ్రామానికి తరలివచ్చారు. ఆదివారం అమ్మవారి సంబరం నిర్వహించి అన్నదానం చేయనున్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం



గూడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ కాలనీకి చెందిన షౌకత్ అలీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసి కాంట్రాక్టర్ మోటేపల్లి రత్నారావు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్‌బాషా, రౌతుల ప్రసాద్, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ - కోడూరు రోడ్డులో రామచంద్రపురం చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయటం చేసి ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవనిగడ్డ నుంచి వచ్చే వాహనాలు, వలందపాలెం నుంచి వచ్చే వాహనాలు, కొత్తపేట వైపు నుంచి వచ్చే వాహనాలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అవనిగడ్డ - కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కూడలి ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

అవనిగడ్డ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన ఐఎస్‌పీఎస్‌వో పరీక్షల్లో బహుమతులు సాధించిన శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాలకు చెందిన డి.మహీదర్ ప్రథమ, సిహెచ్ పి.ఈశ్వర్ సాయి ద్వితీయ బహుమతి, అమృత వర్షిణి మూడో బహుమతి, యు.కార్తీక్, లక్ష్మణ సాయి ఈశ్వర్ నాల్గవ బహుమతి సాధించారు. పాఠశాల నుంచి 64 మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. రాజేష్, ఏఈవో అశోక్, డి.సుధాకర్, శివాజీ, ఏవో శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నేడు

పెడన, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పెడన వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు.